ఆ గాజుబొమ్మ

శ్రీ వాకాటి పాండురంగరావ్

"అభ్యుదయ చిత్రకారుడు అన్నమాట ఒట్టి అబద్ధం—"

—అందరూ ఉలిక్కిపడి చూచారు ఈ మాటలన్న వ్యక్తిని. దీపపుకాంతి ప్రశాంతంగా ఉంది. పంకాలు చప్పుడు మానేసి తిరుగుతున్నాయి. హెడ్‌మేష్టరుగారు పాఠం చెబుతున్న తరగతిలా ఉంది వాతావరణం.

అది ఢిల్లీనగరంలో ఒక పెద్ద హాలు.

అవి సాయంకాలపు ఆఖరి నిముషాలు .

ఒకళ్లిద్దరు మంత్రులు, కొందరు కళాకారులు, ఘరానా మనుష్యులు, కార్లలో తిరుగుతూ సంఘసేవచేసే తెల్లటి లావుపాటి ఆడవాళ్లు, పత్రికా విలేఖర్లు— మొత్తం మీద ఇరవై మంది, అప్పుడే రాయబారిగారు తెరచిన ఆ చిత్రకళా ప్రదర్శనాన్ని తిలకిస్తున్నారు.

విశాలమయిన ఆ హాల్లో అందంగా అక్కడొకటి, అక్కడొకటిగా అమర్చబడి ఉన్నాయి చిత్రాలు. వాటిని చూస్తూ ఆ చిత్రంమీద ఒక మాటా, ఈ చిత్రంమీద ఒక అభిప్రాయమూ పెద్దవారెవరో ప్రకటిస్తే, మిగతవాళ్లు నియాన్ దీపాలకాంతిలా నిశ్శబ్దంగా నవ్వుతూ, మెత్తటి తివాసీలమీద క్రీప్— సోల్‌ల బూట్లతో నడుస్తూ ఉన్నారు.

అదంతా ఒక సంస్కృతి, ఒక ప్రత్యేక ప్రపంచం. అక్కడ గొంతెత్తి పలకడం నేరం. హాయిగా నవ్వడం అనాగరికం. నిజం చెప్పడం అపరాధం. అర్థమైనా కాకపోయినా స్టయిల్‌గా తలవూచి— "ఆహా ! ఇందులో చిత్రకారుడు తన ఆత్మనంతా పిండిపోశాడండి......పిండి పోశాడు...... ఏమి లైను, ఏమి డెప్తు.... ఆహాహా !—" అన్న డైలాగులు పలకవచ్చు. ఇట్లాంటి వాక్యాలురాని వాళ్లంతా ఇట్లాంటి వాక్యాలను మనస్సులో రాసిపెట్టుకుంటారు. మరోచోట వాడడానికి.... ఇదంతా మన దేశంలోనే !

"ఇక్కడ గమనించండి— ఆ నల్లగీత ! అది మానవుడి నిరాశకి గుర్తు. అదిగో ఆ తెల్లటి చుక్క అది శాంతి, అది సుఖం ఈ రెంటినీ కలిపాడు ఆర్టిస్ట్.....అంటే ఆశ నిరాశలు రెండు అవిభాజ్యమని తాత్పర్యం. చూడండి మరి......ఇతడు ఎంత ఆశావాదియో— ఎంత అభ్యుదయ చిత్రకారుడో—" అన్నారు డిప్యూటీ మంత్రిగారు ఇంగ్లీషులో. ఈయనకు ఇంగ్లీషు వ్యాకరణంమీద ఇంత కోపం ఎందుకోననుకున్న రాయబారి పెదవులమీద చిరునవ్వు వెలిగింది. కళమీద నిజంగానే తనేదో గొప్ప వాక్యాన్ని అనేశాననుకుని ఆ మంత్రి ఇకిలించగా సదస్యులు ప్రతిబింబించారు. పరివారమంతా మరో చిత్రం దగ్గర చేరింది.

ఇటువంటి మెత మెత్తటి, సన సన్నటి, చల చల్లటి, నియాన్ లైట్ల— తివాసీల— క్రీప్ బూట్ల వాతావరణంలో— బాంబులాగా పేలింది ఆ వాక్యం. ఆ గొంతు ఇంకా మాట్లాడింది.

"కవి, గాయకుడు, చిత్రకారుడు— ఎవడయినా సరే తను ఉపాసించే కళలో లీనమయిపోయి, ఆ కళలోకి మరణించి మళ్లీ జన్మిస్తే అతడి పునర్జన్మలోని ప్రతిక్షణమూ సత్యం, శివం, సుందరం అయిన కళగా రూపొందుతుంది. కాని అందరికీ అది సిద్ధించదు. అందువలన కళకు తన్ను అర్పించుకున్న ప్రతి వ్యక్తి తదేకమయిన అన్వేషణాపథంలో తప్పటడుగులు వేస్తుంటాడు. ఈ తపస్సులో, ఈ కఠోర సాధనలో— మనిషిని మరింత పిచ్చివాడిగా, మరింత మోహితుడుగా చెయ్యడానికా అన్నట్లు కొన్ని రవ్వలు చిమ్ముతాయి, కొన్ని తారలు తళుక్కుమంటాయి. కళాకరుడికి దారి చూపించడానికా అన్నట్లు— అతడు తననుండి తాను వేరుగా తీసి చూడలేనిది, విడమరచి చెప్పలేనిది— ఏదో ఒకానొక క్షణంలో బయటికి మెరుస్తుంది. హారంలోని ఆ కెరటం, జ్వాలలోని ఆ శిఖ, ఆవేదనలోని ఆ కిరణం— అది పాటకావచ్చు, చిత్రం కావచ్చు, రచన కావచ్చు— అది ఏదయినా సరే అది అదిగానే ఉంటుందిగాని, దానిని ఇంకోదానితో పోల్చి దీనిలో అభ్యుదయం ఉంది అని కెలకడం సరికాదు. ఏ కాలపు కళాఖండమైనా ఆయా కాలపు పరిస్థితులకు ప్రతినిధి, ఆయా కాలపు ప్రభావాలకు ప్రతిబింబం. ఒక చిత్రకారుడి చిత్రం

ఉందీ అంటే అది వ్యక్తిగా అతడి సంఘర్షణల, ఆవేదనల ఆలోచనల ఫలితం. అట్లాంటి దానిని ఇంకొక దానితో పోల్చి— ఇది అభ్యుదయం అనడం— మౌంట్‌బేటిన్ ముక్కు, కృష్ణదేవ రాయల ముక్కుకన్న అభ్యుదయంగలది— అన్నట్లు ఉంటుంది. ఆ మాటకువస్తే అభ్యుదయం అంటే ఏమిటి? మనిషిని మనిషి లాగా గీస్తే అది పాత చింతకాయ పచ్చడియా, మొహంమీద ముక్కోణం గీచి తొడకి రెండున్నర చెవులతికిస్తే అది అభ్యుదయమా ? ఏనిమిదో కార్బన్ కాపీలాగా కనపడక, అర్థమవక ఉంటే అది అభ్యుదయమా—అతడు అభ్యుదయ చిత్రకారుడా?

''అందుచేత ఒక మనిషి అభ్యుదయ భావాలు కలవాడవవచ్చును. అతడే మంచి చిత్రకారుడూ అవవచ్చును. కాని అతడిని అభ్యుదయ చిత్రకారుడు అనడం కేవలం దుష్ట సమాసం అవుతుంది. రాజకీయాలు, రూపాయలు కళచేత చాకిరీ చేయించుకోవడానికి ఈ పదాలు పనికి వస్తాయి కాని అవి నిజం కావు. అభ్యుదయం, గోమయం— అంటూ పరుగెత్తడం మొదలెట్టిన క్షణాన, నిజమైన కళాకారుడు చచ్చి పోవడం తథ్యం అని నా అభిప్రాయం— ''

— అని తపతపమని పేలింది ఆ క్రొత్త గొంతు.

మంత్రుల గుండెలదిరిపోయాయి. 'అబ్బ!

ఎవడీ దుర్మార్గుడు, ఎవ్వడు ఈ అనాగరకుడు ? ఆ! గులాబీ రేకుల్లాంటి వాతావరణంలో ఇనపమేకుల్లా వచ్చాడు, ఏమిటి ఈ దారుణం ! వీడి కెవడిచ్చాడు ఈ స్వాతంత్ర్యం ?—'' అని పెద్దవాళ్లంతా లోలోపల గుండెలు బాదుకున్నారు. వీడి నెవరన్నా చెవులు మెలేస్తే బాగుండును— అనుకున్నారు— ఆ పని తమలో ఒకరు చేసితీరుతారని ఎదురు చూచారొక నిముషం.

కాని అట్లాంటిదేమీ జరగలేదు.

క్రొత్త వ్యక్తి మాటలన్నీ శ్రద్ధగా విన్న రాయబారిగారు ''నా పేరు లుకర్ని.......మిమ్మల్ని కలుసుకోవడం సంతోషంగా ఉంది—'' అని చెయ్యి జాచారు.

ఆ చేతినందుకుని— ''నా పేరు ముకుందం''— అన్నాడే గాని ఎందుకో భయం అన్పించింది యూనివర్సిటీ విద్యార్థి— ఇరవై ఏడేళ్ల ముకుందానికి.

*　　　*　　　*　　　*

ఇది జరిగి రెండేళ్లయింది. ఈ వ్యవధిలో లుకర్ని— ముకుందాల పరిచయం ఓ మోస్తరుగా పెంపొందింది. యూరపు రాజ్యాలలో ఒకదానికి మనదేశంలో ప్రతినిధిగా ఉన్న లుకర్ని, కేవలం— సాయంకాలం వేళల్లో కళమీద అభిప్రాయాలు ప్రకటించి భోంచేసి నిద్రపోయే కులం మనిషి కారు. నిజంగా కళలంటే ఆయనకు ప్రేమ మెండు. ఈ సత్యానికి ఆయన ఇల్లే ఆధారం. ఆయన నివాసమంతా ఆయన కళాభిరుచికి అద్దంగా ఉంటుంది. సుప్రసిద్ధ చిత్రకారుల వర్ణచిత్రాలయితేనేమి, అమూల్యమైన శిల్పాలయితేనేమి, ఇతర కళాత్మకమైన వస్తువులయితేనేమి— మంచి అభిరుచితో ఎన్నుకున్నవి.—ఆయన ఇంటినిండా ఉన్నాయి. ఉద్యోగరీత్యా వెళ్లిన ప్రతిదేశంనుండి ఆ దేశపు ఉత్తమ కళా చిహ్నాలని ఆయన ఎంతో డబ్బుపెట్టి కొని ప్రాణానికన్న అధికంగా పదిలపరుచుకునే వారు వాటి గురించి మాట్లాడటం మొదలుపెడితే— ఇక రాజకీయ చాతుర్యమంతా, మరిచిపోయి పసిపిల్లవాడిలా మాట్లాడే వారు. లుకర్ని. ఇంత అందమైన వస్తువు తనదికదా అన్న ఉత్సాహం, గర్వం నినిపించేవి ఆయన మాటలలో.

ఇటువంటి వ్యక్తితో తనకు పరిచయం ఏర్పడడం తన అదృష్టం అనుకునే వాడు ముకుందం. అయినా అనేక దేశాలలో ఎందరో పెద్దవాళ్లతో మెలిగిన ఆయనెక్కడ, తానెక్కడ అన్పించేది అపుడపుడూ.........మరీ ఆ రోజయితే అంతమంది ఉన్న హాల్లో తానేదో తెలిసినవాడిలా అభ్యుదయ చిత్రకళ మీద లెక్చరివ్వడం ఏమిటి— అని సిగ్గు, నవ్వు వచ్చేవి. అసలు తమాషా ఏమిటంటే ఆ రోజు తను వాగినదానిలో చాలమటుకు తాను ఏకీభవిస్తున్నానని లుకర్నివంటి వ్యక్తి అనడం.....!!

ఇటువంటి పరిస్థితులలో యూనివర్సిటీ విద్యార్థుల సంఘం ఒక ఎగ్జిబిషన్ ఏర్పాటుచేయ నిశ్చయించింది. ఆ నిర్వహణ సంఘంలో ముకుందం ఒక సభ్యుడు. ఎగ్జిబిషన్‌లోని అనేక భాగాలలో కళా విభాగం ఒకటి. అక్కడ విద్యార్థుల కళా తృష్ణను ప్రదర్శించే వివిధ వస్తువులు, చిత్రాలేకాక— నగరంలోని పెద్ద పెద్దవారినుండి కొన్ని గొప్ప చిత్రాలను, శిల్పాలను ఎరువుగా తీసుకొచ్చికూడా జన సామాన్యానికి చూపించాలని నిర్ణయించారు.

సరిగ్గా ఈ విశ్చయంలోనే— ముకుందం జీవితంలో చిత్రమయిన సంఘటన ఒకటి పుట్టింది.

లుకర్నిగారి కళాఖండ సముదాయంనుండి ఒకటి రెండింటిని ఆయన్నడిగి తెచ్చేపని ముకుందానికి అప్పగించారు. ఆ బాధ్యత తనమీద పడటం గర్వకారణంగా ఉన్నప్పటికీ, ముకుందానికి లోలోపల ఏదో బెటుకుగానే ఉంది.

లుకర్ని వద్ద వున్న 'ఆర్ట్ పీసెస్' అన్నిటిలోకి ఆయనక్కడుంగడు ప్రీతిపాత్రమైనది. గాజుతో చేయబడిన బ్యాండు వాయిద్యగాళ్ల బొమ్మల బృందం. ఆయన జర్మనీలో, దానిని ఒక జమీందారునుండి కొన్నారు. దాదాపు వంద ఏండ్ల వయస్సు

గల ఆ బృందంలో వివిధ వాద్యాలు వాయించేవారి బొమ్మలు ఇరవైనాలుగున్నాయి. ఒక్కొక్క బొమ్మా రెండంగుళాల ఎత్తు మాత్రమే ఉన్నప్పటికీ— ఆ రెండంగుళాల మేరలోనే వాటిని తయారుచేసిన కళాకారుడి గొప్పదనం గోచరిస్తుంది. కండ్లు, ముక్కు తీరుగాదిద్దిన మొహాలు, రంగు రంగుల దుస్తులు ఆయా వాద్యాలను వాయిస్తున్న భంగిమలు— ఈ అంశాలన్నీ ఎంతో వివరంగా, స్పష్టంగా, చైతన్యవంతంగా కనిపిస్తాయి వాటిలో. ఆ రంగు రంగుల బొమ్మలన్నీటినీ అందమైన వెడల్పాటి గాజు 'ట్రేలో' అమర్చి— ఆ ట్రేని తమ భవనపు ముందు వైపులో— గుమ్మానికి ఎదురుగా ఉంచారు లుకర్ని. వారి ఇంటోకి అడుగు పెడుతూండగానే— ఎట్ట ఎదురుగా జీసస్ క్రైస్ట్ తైలవర్ణ చిత్రం, నాలుగడుగుల పొడవుది, గోడ మీద ఉంటుంది. దానిక్రిందుగా టేబిల్‌మీద 'ట్రేలో' గాజు బొమ్మల బృందం ఎంతో ముచ్చటగా ఆకర్షణీయంగా— ఆ వాద్యగాళ్లందరూ ఎవరికీ వినరాని ఇంపైన సంగీతాన్ని విన్పిస్తున్నట్లుంది. ఏ క్షణాన్నయినా వాళ్లందరూ పాటలు వాయిస్తూ— ఆ 'ట్రే' నుండి 'లిల్లిపుట్'ల లాగా ముందుకు వచ్చేస్తారేమోనన్పిస్తుంది.

అటువంటి ఆ బొమ్మలని తమ ఎగ్జిబిషన్‌లో పదిరోజులపాటు ప్రదర్శించుకోవడానికి ఎరువుగా ఇస్తారా అని ఒకరోజు ఉదయం అరఘంట నీళ్లు నమిలి నమిలి ఆఖరికి అడిగాడు ముకుందం.

లుకర్ని మాట్లాడలేదు. ఆ రెండు నిముషాలూ, హాల్లోని గడియారమా, తన గుండెయా, ఏది చప్పుడు చేస్తున్నదో తెలియలేదు ముకుందానికి.

"ఆ బ్యాండు మాస్టర్స్ సెట్టు నా ప్రాణానికన్న ముఖ్యం మిస్టర్ ముకుందం ! నా దగ్గర ఉన్న వస్తువులలో ఇంక దేని మీదలేని అభిమానం నాకు దానిమీద ఉంది. దాని ఖరీదు ఆరువేల రూపాయలవి మాత్రమేగాదు, అరవై వేలు పోసినా ఆ "డ్రెస్‌డెన్ ఫిగరిన్లు" తయారుచేయగల హస్తాలు ఈనాడు లేవు.........అందుకని."

అయితే ఇక లేద్దామనుకున్నాడు ముకుందం. ఆయన ఆ బొమ్మల్ని ఇవ్వననడం పెద్ద 'రిలీఫ్'గా అన్పించింది ఎందు చేతనో— !

"కాని మీరడిగారు గనుక ఇస్తాను. దానిని అతి జాగ్రత్తగా తీసుకెళ్లి, భద్రంగా ఉంచుకుని క్షేమంగా ఇవ్వండి.... అంతే—" అని ముందు హాల్లో టేబిల్‌వైపు నడిచారు లుకర్ని

ముకుందం గుండె లోపలికి రాయిలా పడింది—సంతోషం.

ఎగ్జిబిషన్ పదిరోజులపాటు జయప్రదంగా జరిగింది. ప్రజలు తండోప తండాలుగా వచ్చారు. పత్రికలు ప్రదర్శనాన్ని మెచ్చుకుంటూ, ఆ గాజుబొమ్మల బృందం ఫోటోలని ప్రచురించాయి. విద్యార్థులు ఉప్పొంగిపోయారు.

పదిరోజులూ ఆ గాజు బొమ్మల్ని కంటిని రెప్పల్లా కాపాడాడు ముకుందం. ప్రదర్శన అంతా ముగిసి ఆ బొమ్మలన్నీ క్షేమంగా ఉన్న సందర్భంలో కృతజ్ఞతా సూచకంగా తిరుపతి వెంకటేశ్వరుడికి నూట ఎనిమిది కొబ్బరికాయలు కొడతానని మొక్కుకున్నాడు. కూడా ! పది రోజుల తరువాత ఆ ప్రదర్శన ముగిసిన రోజు రాత్రి హాయిగా పీడ కలలు లేకుండా నిద్రపోయాడు ముకుందం.

మరుసటి రోజు ఉదయం— మొట్ట మొదటి పని ఆ బొమ్మల్ని లుకర్ని గారింటికి చేర్చటం— అని పదే పదే అనుకున్నాడు— ఆ ప్రకారమే ప్రొద్దున్న ఎనిమిదింటికల్లా జాగ్రత్తగా ఆ బొమ్మలన్నిటిని ,ట్రే'లో పెట్టుకుని ఒక క్సీలో కూచుని, ఆ బొమ్మలున్న 'ట్రే'ని తన ఒడిలో పెట్టుకుని కూర్చున్నాడు.

ాక్సీ బయలుదేరింది

అమ్మయ్య ! ఇంకో అరగంటలో పెద్ద బాధ్యత తీరిపోతుంది— అని నిట్టూర్చాడు ముకుందం. యూనివర్సిటీలో ఆఖరి పరీక్ష రోజునకూడా మనసు ఇంత తేలిక పడలేదతనికి.

ఆ టాక్సీ డ్రైవర్ జగజిత్‌సింగ్ చాలామంచివాడే. ఎటొచ్చి పంజాబీ డ్రైవర్లందరిలాగే— అతడుకూడా రోడ్లన్నీ తన కోసమే ప్రత్యేకించి వేశారన్న విశాల హృదయంతో కారు నడుపుతాడు. అందుచేత ఈ వేళ నగరం నడిబొడ్డుమీద నాలుగు రోడ్ల కూడలిలో అతడు అల్లంత దూరంనుండి ఆకుపచ్చ దీపాన్ని అదియే శాశ్వతమనుకుని, కరికి లంఘించు సింహంబు కరణి రాబోవడం, ఈ లోపుగా ఆ మాయదారి ఆటోమేటిక్ సిగ్నల్‌లోని ఎర్రదీపం తగుదునమ్మా అని వెలగడం, పాతికమైళ్ల వేగంలో వెళ్తున్న కారుని నాలుగు గజాల దూరంలో జగజిత్‌సింగ్ ఆపడం, ఆ వూపులో ముకుంద ఒడిలో ఉన్న 'ట్రే' ముందుకు ఒలకడం— టక టక జరిపోయాయి.

అయిదు ప్రాణాలలో నాలుగు ఎగిరిపోయిన ముకుందం అనే యూనివర్సిటీ విద్యార్థి—గాజు బొమ్మలన్నిటినీ ఏరి మళ్లా అమర్చి లెక్కపెడితే— అన్నీ ఉన్నాయి. అంతేకాదు. ఒకటికి పదిసార్లు తరచి తరచి చూచిన తర్వాత ఆ బ్యాండు బృందపు సభ్యులందరూ ఆరోగ్యంగా ఉన్నారనికూడా తేలింది !

ఆ గా జు బొ మ్మ

''హెయిల్ ఫాదర్లాండ్' అని ఆనందోద్రేకంలో అరిచాడు ముకుందం. వెంకటేశ్వరస్వామికి నూట ఇరవై కొబ్బరికాయలు కొడదామని ప్రతిపాదించుకున్నాడు. ఇంకా ఆ సంతోషంలో—, జగత్‌సింగ్‌నిం కప్పడడం మాట అట్లావుంచి ఆ వెధవ గడ్డమే గనుక లేకపోతే వాడిని ముద్దెట్టుకుందామనిపించింది.

ఇంకో అయిదు నిముఃషాలలో, సవ్యంగా ఎర్రదీపాలన్నిటినీ దాటి టాక్సీ రయ్‌మని బారాకంబారోడ్‌మీద ఉన్న లుకర్నిగారి ఇంటి కాంపౌండ్‌లోకి ప్రవేశించింది. పెద్ద తోటను దాటి పోర్టికోలో ఆగింది టాక్సీ.

ఆ పోర్టికోలోనే లుకర్నిగారి దేశపు జెండాను అలంకరించుకుని నిలబడి ఉంది పొడుగాటి నల్లటి కారు. ఆ కారు డ్రైవర్— ఇంకొక గడ్డాలసింగు, తెల్లటి యూనిఫారం ధరించి ఆ కారు తలుపు తీసి పట్టుకుని నిల్చుని ఉన్నాడు.

ముకుందం జగత్‌సింగ్‌కు డబ్బులిచ్చి, జాగ్రత్తగా 'ట్రే'ని తిరుపతిలో మొక్కుబడి వున్న వాళ్ల హుండీ, ప్రసాదమూ ఉన్న పళ్లాన్ని పట్టుకున్నట్లుగా— పట్టుకొని బయటికి దిగాడు. వెడల్పాటి మెట్లను సమీపించాడు. మెట్ల చివర వరండా, దాని వెనక హాలు, హాల్లో ఎట్ట ఎదుట గోడమీద జీసస్ చిత్రం, దానిక్రింద టేబిల్ కనపడుతున్నాయి పోర్టికోనుండి.

ఇరవై నాలుగు వేడివేడి టీ కప్పులని శ్రీ మహా విష్ణువు వగైరాలున్న టేబిల్ దగ్గరకు తీసుకువెళ్తున్న 'బేరర్'లా మొదటి మెట్టుమీదికి ముకుందం అడుగు పెడుతుండగా— పై మెట్టుమీద ప్రత్యక్షమయ్యాడు లుకర్ని.

''హల్లో మిస్టర్ ముకుంద్ ! మీ ఎగ్జిబిషన్ అయిపోయిందా—గుడ్..... ఆ! జాగ్రత్త, జాగ్రత్త—'' అని అపాటికి సగం మెట్లెక్కి వచ్చిన ముకుందాన్ని సమీపించి ఆ ట్రేలోని బొమ్మలవైపుచూచి వాటిలో 'క్లారినెట్' వాద్యగాణ్ణి ఎడమ చేతి వేళ్లతో పైకెత్తి పట్టుకుని-''బాగున్నాడుకదూ వీడు-ఆ మొహం మీద 'ఎక్స్‌ప్రెషన్' చూడండి....... ఎంత సహజంగా ఉందో—'' అని వాడిని ట్రేలో ఉంచేసి—'' వోకే......ఆ టేబుల్‌మీద పెట్టెయ్యండి— నేను ఒయటికి వెడుతున్నా—' అని మెట్లుదిగి పోర్టికోలో ఉన్న కారుదగ్గరికి నడిచారు.

ఇందాకా టాక్సీలో 'ట్రే' ఒరికినప్పుడు తాను సరిగా చూడలేదేమో, సరిగ్గా లుకర్ని ముట్టుకునేసరికి ఏదో ఒక బొమ్మ విరుగుతుందేమో అని ప్రాణాలన్నీ, 'ట్రే'లో పెట్టుకున్న ముకుందం పెదవులమీద తడిసిన అగ్గిపుల్ల వెలిగినట్లు ఒక నవ్వులాటిది వెలిగింది. ''థాంక్యూ'' అని మిగత మెట్లు దాటి వరండా చేరాడు.

— 'ఆ జీసస్ బొమ్మ, ఆ క్షణాన తన, అంతరంగానికి అచ్చం వ్యతిరేకంగా, ఎంత ప్రశాంతంగా ఉంది !' అనుకుంటూ ముకుందం వరండా దాటుతున్న ఆ నిముషాన్నే— ఆ సౌధంబులో నొక మూలగా జార్జి అనే డాఘుండ్ శునకము గొంతెత్తి తన ఆకలిని తెలుపగా, సింహానికన్న గ్రామసింహాలమీద భయభక్తులుగల ముకుందం భయంతో పిడచగట్టుకుపోయి, తూలి పడపోయి, తట్టుకుని నిలబడ్డాడు. భీత నేత్రుడై పరికిస్తే ఆ పరిసరాలలో క్రూర మృగాలేమీ కనపడలేదు. కాని అతడి చేతిలోని 'ట్రే'లో నలుగురైదుగురు అలిసి పడుకున్నట్టు కనపడింది.

కారెక్కబోతూ సిగరెటు వెలిగించుకునే నిమిత్తం క్రింద పోర్టికోలో నిల్చున్న లుకర్ని అదే క్షణానికి ఇటు చూచారు.

ఆయన చూశాడేమో తన నృత్య విలాసం, అని తల వెనక్కుతిప్పి, ఆయన నిజంగానే చూస్తున్నాడు బాబోయ్ అని తెలుసుకుని అబ్బే నేను పోర్టికో చూడడం కేవలం మెడ పొరపాటు అన్నట్లుగా మెడనిటూ అటూ త్రిప్పి, అది ఆపి, గడప జాగ్రత్తగా దాటి హాల్లోని తివాసీమీద పన్నెండడుగులూ వేసి ఆ టేబిల్ దగ్గరకు చేరాడు ముకుందం. గోవర్ధనగిరిని క్రిందకు దింపుతున్న గోపాల కృష్ణుడిలా, పురిటికోసం పుట్టింటికొచ్చిన అమ్మాయిని అత్తవారింట క్షేమంగా దిగబెడుతున్న తండ్రిలా— ఆ 'ట్రే'ని టేబుల్‌మీద ఉంచాడు. ముకుందం. ఇందాక వరండాదాటి హాల్లోకి వస్తుండగా 'ట్రే'లో ముందు కొరిగిన నాలుగు బొమ్మలలోను మూడింటిని జయప్రదంగా నిల్చోబెట్టాడు. నాలుగవ శాల్తీ— పెద్ద డ్రమ్స్ వాయిస్తున్న వాడిని— నిల్చోబెట్టబోతే, వాడి తలకాయ మాత్రం ముకుందం చేతిలోకి వచ్చినదాయెను !!

రెండుసార్లు 'లైటర్' సరిగా వెలగకపోతే, దానిని కోటు జేబులో పడేసుకుని డ్రైవర్ నడిగి అగ్గిపెట్టె తీసుకుని, అగ్గిపుల్ల వెలిగించి దానితో సిగరెట్టు ముట్టించబోతూ హాల్లో టేబిల్‌మీద 'ట్రే'ని అమర్చిన ముకుందాన్ని గమనించి, తృప్తికరంగా ఇటు తిరిగి సిగరెట్టు ముట్టించి అగ్గిపుల్లను పారేసిదానిమీద బూటుపాదం ఉంచారు లుకర్ని.,

పంచ ప్రాణాలు ఎగిరిపోగా, నవనాడులూ క్రుంగిపోగా తిరుపతి దేవుడికి కొట్టవలసిన కొబ్బరికాయల సంఖ్యను అర్జెంటుగా అయిదింటికి తగ్గించేసి— నడి సముద్రంలో మునిగిపోతున్న ఈతరాని వాడిలా— కేవలం మానవాతీతమైన శక్తి ప్రేరేపిస్తుండగా— ఒక్క క్షణం పోర్టికోవైపు చూసి, లుకర్ని నంగి సిగరెట్టు దగ్గరకు వెళ్లుతున్న అగ్గిపుల్లను చేరు

పట్టుస్తున్న ఆ లిఫ్టులో డ్రమ్‌మాష్టర్ తలనూ, డ్రమ్‌తోకూడిన దేహాన్ని ఒక్క వూపుతో ఎడమ పిడికిలిలోకి తీసుకుని, పంట్లాంయొక్క ఎడమ జేబులోకి తోసేసి నిల్చున్నాడు ముకుందం.

ఇతడొచ్చిన టాక్సీ ఇందాకనే వెళ్లిపోయింది, వచ్చేట్లయితే, ఓ నిముషం ఆగి, కుర్రవాడిని మన కారులో తీసుకెళ్లి దిగబెడదాం. అనుకుని లుకర్ని మొదటిసారిగా సిగరెట్టు పీల్చి హాలువైపు చూచాడు.

అనేక యుగాల క్రిందనగా ఈ లుకర్ని అన్న మానవుడు కారులో ఎక్కుతానని మాటఇచ్చి మెట్లు దిగినవాడు, ఆ డ్రైవర్ అట్లా కారు తలుపు తెరచి పట్టుకుని ఉన్నా, ఆ కారుసీటు అంత మెత్తగా విశాలంగా హాయిగా ఆహ్వానిస్తున్నా— వెళ్లి లోపల కూచోడేం అని టేబిలు ప్రక్కనే నిల్చున్న ముకుందం మధనపడ్డాడు.

ఇందాకనగా 'ట్రే'ని టేబిల్‌మీద పెట్టిన ఈ అబ్బాయి ఇంకా అక్కడే నిల్చున్నాడేం— పాపం అందమైన ఆ బొమ్మల్ని విడవలేక పోతున్నాడు కాబోలు— నిజంగా ఆ కళా తృష్ణ అనేది ఉంటే అంతే— అనుకుని ఇంకోసారి సిగరెట్టు పీల్చారు లుకర్ని.

చరణ్‌సింగ్ అన్న చాకలివాడు, ముకుందానికి మూడేళ్లుగా బట్టలుతికినవాడు, బటన్లమీద ఒట్టలమీద అంతగా దయలేనివాడు, అంతకుముందు వెళ్లిన ఆదివారం పొద్దున్న ఉతికి తెచ్చిన తెల్ల డ్రిల్ పంట్లాములో ఎడమ జేబుని కొంచెం బలహీనమైన దశలో ఇచ్చి వెళ్లాడు. ఇటువంటి పరిస్థితి ఒకటి, ఒకటే, వంద ఏళ్ల తర్వాత ఒకానొక ప్రాచ్య దేశంలో ఏర్పడుతుందని ఎరగని జర్మన్ కళాకారుడు తాను చేసిన ఇరవై నాలుగు బ్యాండు వాయిద్యగాళ్ల గాజు బొమ్మలలో ఏ ఒక్కటి కూడా సగటున రెండు వందల గ్రాముల బరువుకు తగ్గకుండా ఉండేటట్లు చేశాడు. ఆ జర్మన్ కళాకారుడు ఇక్కడ ఈ చరణ్ సింగ్‌డు, వీళ్లిద్దరి కుట్ర ఫలితంగా— సరే ఇక లాభం లేదు అనుకుని అనాదిగా భారతీయులలో రక్తనాళాలలో ప్రవహిస్తున్న ధైర్య శౌర్య సాహసాది గుణాలను క్రోడీకరించుకుని కాళ్లల్లోకి తెచ్చుకుని ముకుందం ఒక్కడుగు ముందుకువేసిన క్షణాన్నే అతడి పంట్లాంయొక్క ఎడమ జేబు కొద్దిగా చిరగగా తద్వారా డ్రమ్ మాష్టరుగారి తలభాగం బావిలోకి దిగుతున్న బొక్కెనలాగా రంయ్‌మని ముకుందంయొక్క ఎడమ మోకాలిమీద ఉన్న కుక్క కాటు మచ్చమీదుగా, పంట్లాం లోపలి వైపునే జారి, అతడి పాదం దగ్గర పంట్లాం మడతకూ బూటుయొక్క ఒక వేపు తోలుకీ మధ్య అదో మోస్తరు అస్థిర నిశ్చలతతో నిలబడింది.

''హా ! ఏసునాథా ! ఇంక నీవేగతి— అని పైకి చూశాడు ముకుందం. ఎడమ పాదాన్ని తేలుకుట్టినా ఆ క్షణాన అతడు దానిని కదిల్చి ఉండడని పందెం కాయవచ్చు !

సిగరెట్టు నాలుగో దమ్ములాగి, ఇటుచూసి సరే— ఆ జిసస్ చిత్రంలో పడ్డాడు. ఇతడు నిజంగానే కళాభిమాని ! అందుకు సందేహంలేదు, అని నిర్ణయించుకున్న లుకర్ని కారులోకి అడుగు పెట్టారు.

''మేరీ మాతా ! రామచంద్ర ప్రభో ! సిద్ధార్థా— ఫల్గుణా—'' అని నోటికొచ్చినట్టల్లా దేవుడిని పిలుస్తూ ఈసారి అటు చూచేసరికి ఆ నల్లటి, దెయ్యంలాంటి కారు అక్కడి కనిపించరాదని హృదయపూర్వకంగా నమ్మి పోర్టికో వైపు చూసిన క్షణాన, కారు అక్కడ ఉండడమేకాదు, అందులో కూర్చుని ఉన్న లుకర్ని తన్నుకూడా రమ్మంటూ చెయ్యి వూపడం కనిపించింది ముకుందానికి.

ఈ రోజుతో అయిపోయింది ముకుందం అనే చిన్నవాడి పని. ఇంక హరిహర బ్రహ్మాదులు కట్టకట్టుకొచ్చినా చేసేదిలేదు— అని కనుమూసి తెరిచేటంతలో గభుక్కున వంగి, అత్యావసరం మీద ఎడమ పాదాన్ని గోక్కుని — ఆ డ్రమ్ మాష్టరు పరమ దుర్మార్గుడు— వాడి తలను గభుక్కున పట్టుకుని, ఆ చేతిని పైకి గోడమీదకు పాకుతున్న నల్లిలా లాక్కుని, ఉరి కంబంపైపు అడుగులు వేస్తున్న శిక్షితుడిలా పోర్టికోవైపు తిరిగాడు ముకుందం.

సరిగ్గా ఆ క్షణాన్నే ముందుకు కదిలింది నల్లకారు !

తను వంగి ఏదో తీయడం ఆయన చూచాడా ?

ఇంతసేపు ఇట్లా నిల్చోవడం గురించి ఏమనుకున్నాడు?

—అన్న ప్రశ్నలు ముకుందం మెదడు మీద సమ్మెటపోటులై కొడుతుండగా, ఆ రాయబార కార్యాలయంలోని ఒక కార్యదర్శి— అటువచ్చిన వాడు— అడిగాడు— ''అరె ! మీరు వర్షంలో తడిసి వచ్చినట్లున్నారే—'

''హిహిహి. . . అవును. . . మరే. . . తడిశా. . . మరే. అవును—'' అంది ముకుందం గొంతు.

''మరిటువైపు మంచి ఎండ కాస్తూంది, బొట్టు వర్షం లేదు !—'' అని ఆశ్చర్య పోయాడు కార్యదర్శి.

''. . . కాని మా యూనివర్సిటీ వైపు వారం నుండి ఒకటే వర్షం. . . ధారాపాతం. . . కుంభోపాతం. . . జలపాతం''

"అబ్బా! పత్రికల్లో ఎక్కడా చూడలేదుస్మండి—"

"పత్రికలా! హాహా! వాన దేవుడినీ పత్రికల వాళ్ళనూ డ్రమ్ వాయించే వాళ్ళనీ ఎప్పుడూ నమ్మకండి. . . వస్తా—" అని ఎడమ పిడికిలివి బిగించి పంట్లాం జేబులో నుంచి, ఆ జేబు చిరుగు మధ్య ఇరుక్కుని ఉన్న డ్రమ్ మాస్టర్ మొండెం క్రిందికి జారకుండా ఎడమ చేత్తోనే నొక్కిపట్టుకుని, ద్రౌపదమ్మ తిరునాళ్ళలో నిప్పులు తొక్కుతున్న వాడిలా— స్వానిష్ డాన్సర్‌లా—అలా అలా నడవ బోతుండగా—"మిస్టర్ ముకుందం? అని ఎవరో పిలుస్తున్నట్లుంటే— అది తన అంతరాత్మయే ననుకుని మరింత జోరుగా వడివడిగా అడుగులు గజాలు వేసుకుంటూ హాలు, వరండా, తోట అన్నీ దాటి రోడ్డు మీద కొచ్చి నిలిచాడు ముకుందం. ఆరువై యేళ్ళు కారాగారంలో ఉండి స్వేచ్ఛలోకి వచ్చినట్లు— హాయి అన్పించింది.

అది అర నిముషం మాత్రమే.

మరుక్షణం చేతిలో ఉన్న డ్రమ్ మాస్టర్ తల గుర్తొచ్చింది. జేబులో మొండెం బరువెక్కసాగింది. శవాలు బరువెక్కుతాయట. నిజమే!

హా! తను చచ్చిపో గలిగితే బ్రతుకెంత బాగుండేది!

ఎదలో పదిలక్షల అమావాస్యలు ఆవరించగా హాస్టల్‌లో తన గది చేరాడు ముకుందం. ఆ రోజల్లా ఎవరి మొహమూ చూడ దలచుకోక గదిలోపల గడియ పెట్టుకున్నాడు.

కాని సాయంకాలం అదే పనిగా ఎవరో బాదితే తలుపు తెరిచాడు. ఫోన్ మీద ఎవరో ఇప్పటికి రెండుసార్లు పిలిచారు, ఇది మూడవసారి అని ప్యూన్ చెబితే వార్డెన్ గదిలోని ఫోన్ వద్దకు పరుగెత్తాడు ముకుందం.

"హల్లో ముకుందం! నేను మిసెస్ లుకర్ని—"

అయ్య బాబోయ్— ఫోన్ మీద. . . . ?

"మిస్టర్ ముకుందం— పొద్దున్నే చెబుదామని మిమ్మల్ని పిలుస్తుంటే మీరు వినిపించుకోకుండా వెళ్ళిపోయారు— ఎల్లుండి మా దేశ స్వాతంత్రోత్సవ దిన సందర్భంగా రాత్రి ఎనిమిదింటికి డిన్నర్ పార్టీ ఉంది. మీకు పోస్టులో ఆహ్వానం అందుతుంది. తప్పక రండి."

హమ్మయ్య. . . నిజంగా దేవుడున్నాడు!

"ఆ తర్వాత మిస్టర్ ముకుందం! ఆ డ్రమ్ మాస్టర్ విషయం—"

అయింది. . అయిపోయింది. . . జనం గశే! రండి, ముకుందం నరకబడుతున్నాడు— చూడండి—

"ఆ బ్యాండ్ సెట్‌లో డ్రమ్మర్ బొమ్మ మెడదగ్గర ఇదివరకు ఒక్కసారి ప్రిన్సిపాల్ విరిగితే 'సొల్యూషన్' పెట్టి అతికించాము. మొదట మీకా బొమ్మలు ఇచ్చినప్పుడే చెపుదామనుకుని లుకర్ని మరిచి పోయారట— అదీ సంగతి! తప్పక ఎల్లుండి రండి— ఆ గాజు బొమ్మతో—"

—"వ్వాట్!" అని టార్జాన్‌లా పొలికేక పెట్టి టెలిఫోన్ పారేసి, ఎగిరి టేబిల్ దాటి అవతల ఉన్న వార్డెనును తన బిగి కౌగిలిలో వోలలాడిస్తూ—

"రెండు వందల కాయిలూ— ఆ!. . కొట్టేయవలసిందే" అన్నాడు ముకుందం.

"ఈ కుర్రవాడు తాగివచ్చాడు — ప్రిన్సిపాలుతో చెప్పాలి"—అనుకుని ఆ కౌగిలి బయటికి వచ్చాడు వార్డెనుడు?